www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 27 నవంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-197 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## పీఎస్ఎల్వీ సీ 54 రాకెట్ ప్రయోగం విజయవంతం

ఇస్రో చరిత్రలో మరో విజయం నమోదు • ప్రయోగం సక్సెస్‌తో శాస్త్రవేత్తల్లో ఆనందోత్సాహాలు




**బెంగళూరు, నవంబర్ 26 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ సీ 54 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన ఈ రాకెట్ ద్వారా 9 ఉప గ్రహాలను అంతరిక్షంలో ప్రవేశపెట్టారు. భూమికి 720 కిలోమీటర్ల ఎత్తులో సన్ సింక్రోనస్ ఆర్బిట్‌లోకి వాటిని పంపారు. 960 కేజీల ఓషన్ శాట్-6తో పాటు మరో 8 నానో శాటిలైట్లు ఇందులో ఉన్నాయి. భూటాన్‌కు చెందిన ఓ శాటిలైట్ 'భూటాన్ శాట్' కూడా ఇందులో ఉంది. శుక్రవారం ఉదయం 10:26 గంటలకు ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్, లాంచ్ ఆథరైజేషన్ బోర్డు ఛైర్మన్ అర్ముగం రాజరాజన్ కౌంట్ డౌన్ ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రమే రాకెట్ లోని నాల్గో దశలో ద్రవ ఇంధనం నింపే పక్రియ పూర్తి చేశారు. ఆ తర్వాత అన్ని పరీక్షలు

3లో

## మన రాజ్యాంగమే మనకు రక్ష



ప్రపంచం యావత్తూ భారత్వైపు చూస్తోంది

రాజ్యాంగ దినోత్స వేడుకల్లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమ సమాజం):** యావత్ ప్రపంచం ప్రస్తుతం భారతదేశాన్ని ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ , అంతర్జాతీయ ప్రతిష్టల మధ్య ఆశతో చూస్తోందని ప్రధాన మంత్రి మోడీ గుర్తు చేశారు. ఈ విజయానికి మన రాజ్యాంగం కారణమన్నారు. ఆధునిక కాలంలో, రాజ్యాంగం దేశం అన్ని సాంస్కృతిక , నైతిక భావోద్వేగాలను స్వీకరించిందని అన్నారు. అమృత్‌కాల్‌ను 'కర్తవ్య కాల'గా పేర్కొంటూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆజాదీ కా అమృత్‌కాల్‌లో, రాబోయే 25 ఏళ్ల అభివృద్ధి కోసం మనం ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న తరుణంలో కర్తవ్యం అనే మంత్రాన్ని ప్రధాని నొక్కిచెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శనివారం భారత అత్యున్నత న్యాయస్థానంలో రాజ్యాంగ దినోత్సవ

3లో

## ఆర్టికల్ 3 తోనే తెలంగాణ కల సాకారమైంది

అనేక దేశాలకు ఆదర్శంగా మన రాజ్యాంగం

రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో గవర్నర్ తమిళసై



**హైదరాబాద్, ననవంబర్ 26 (సమ సమాజం):** రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 తోనే తెలంగాణ కల సాకారమైందని గవర్నర్ తమిళిసై అన్నారు. ఇతర దేశాలకు మన రాజ్యాంగం స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. రాజ్ భవన్ లో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా మాట్లాడిన గవర్నర్ తమిళిసై

3లో

## ముందుచూపుతో అంబేడ్కర్ రాజ్యాంగ రచన

అందువల్లే తెలంగాణ ఏర్పాటు సాధ్యం: వివేక్



**న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమ సమాజం):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాసేటప్పుడు ముందుచూపుతో అన్ని వర్గాలకు మేలు చేసేలా రాశారని బీజేపీ జాతీయ కోర్ కమిటీ సభ్యులు వివేక్ వెంకటస్వామి చెప్పారు. అంబేద్కర్ రాసిన రాజ్యాం ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చాలా గొప్ప మేధావి అని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి వ్యతిరేకంగా కుటుంబ పాలన, అవినీతి పాలన రాష్ట్రంలో కొనసాగుతోందని

3లో

## మహిళల పట్ల బాబా రాందేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు



సర్వత్రా నిరసనలు వ్యక్తంచేస్తున్న మహిళలు

**ముంబై, నవంబర్ 26 (సమ సమాజం):** మహిళల వస్త్రధారణపై ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్ బాబా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. దుస్తులు ధరించకపోయినా మహిళలు అందంగానే ఉంటారంటూ రామ్‌దేవ్ బాబా చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్రలోని థానే నగరంలో పతంజలి

2లో

## వేరేమహిళతో ఉన్న కేసులో సిఐ రాజు సస్పెన్షన్

**హైదరాబాద్, ననవంబర్ 26 (సమ సమాజం):** సీసీఎస్ సీఐ రాజు సస్పెండ్ అయ్యారు. రాజును సస్పెండ్ చేస్తూ సీపీ సీవి ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ 4న వేరే మహిళతో కారులో ఏకాంతంగా ఉండగా అతడి భార్య రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోగా..ఘటనాస్థలికి వెళ్లిన కానిస్టేబుల్‌పై సీఐ దాడి చేశారు. కానిస్టేబుల్ ఫిర్యాదుతో పోలీసులు రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో రాజును సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. 2002 బ్యాచ్‌కు చెందిన రాజు హైదరాబాద్ సీసీఎస్ విభాగంలో పనిచేస్తున్నారు.

## ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఇడి ఛార్జిషీట్

3వేల పేజీలతో కూడిన ఛార్జ్ షీట్ దాఖలు




**న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి

3లో

## మధ్యప్రదేశ్‌లో కొనసాగుతున్న జోడో యాత్ర

రాహుల్ యాత్రకు విశేష స్పందన



**భోపాల్, నవంబర్ 26 (సమ సమాజం):** రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మధ్యప్రదేశ్‌లో ఉత్సాహంగా కొనసాగుతోంది. అక్కడ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తుల పెద్ద ఎత్తున రాహుల్ వెన్నంటి నడుస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో బజెపిఎలా అధికారాన్ని హస్తగతం చేసుకుందో.. కమలనాథ్ ప్రభుత్వాన్ని ఎలా కూల్చిందో రాహుల్ తనయాత్రలో వివరిస్తున్నారు. శనివారం మోర్తక్క గ్రామం నుంచి 80వ రోజు పాదయాత్ర ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రాతో కలసి పాదయాత్ర పాల్గొన్నారు. గత మూడు రోజులుగా సోదరి ప్రియాంక, ఇతర కుటుంబ సభ్యులతో కలసి రాహుల్ చేస్తున్న

3లో

## చలికాలం ఆరోగ్య సమస్యలు

అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

**హైదరాబాద్, ననవంబర్ 26 (సమ సమాజం):** చలికాలంలో అనేక రకాల అనారోగ్య సమస్యలు వేధిస్తుంటాయి. సీజన్స్ మారినప్పుడు వ్యాధుల ప్రభావం మరింత పెరుగుతుంటాయి. చలికాలంలో చాలా మంది ఎక్కువగా జలుబు సమస్యతో ఇబ్బంది పడుతుంటారు. ఎక్కువగా చల్లటి వాతావరణంలో ఉండడం వలన గొంతు సమస్యలు.. ముక్కు దిబ్బడ, జలుబు చేయడం వంటివి కలుగుతుంటాయి. అలాగే ఈ సీజన్లో అనారోగ్య సమస్యలను నియంత్రించుకోవడం ఎంత ముఖ్యమో.. శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడం

3లో

## శంషాబాద్‌లో 2కిలోలకుపైగా బంగారం పట్టివేత



3లో

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి

సిద్దిపేటను అగ్రగామిగా నిలిపేందుకు కృషి

**సిద్ధిపేట, నవంబర్ 26 (సమ సమాజం):** రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలకనుగుణంగా జిల్లాలోని మున్సిపాలిటీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిస్థాయిలో నిషేధం కోసం యత్నిస్తున్నామని అధికారులు అన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా పని చేయాలనిస్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఆయా మున్సిపాలిటీల్లో డిసెంబర్ చివరి నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్

3లో

## రాజ్యాంగ స్ఫూర్తితో కెసిఆర్ పాలన

గతంలో ఎన్నడూ లేనంతగా పురోగతి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**వరంగల్, నవంబర్ 26 (సమ సమాజం):** స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందించే రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆయన స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ బాటలు వేస్తున్నారని చెప్పారు. ఏటా నవంబర్ 26ను భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిన

3లో

## అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్యరైల్వే శుభవార్త

స్వామి దర్శనానికి వెళ్లే వారికి ప్రత్యేక రైలు



**హైదరాబాద్, ననవంబర్ 26 (సమ సమాజం):** అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్యరైల్వే శుభవార్త అందించింది. శబరిమల వెళ్లే వారి కోసం 38 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. డిసెంబర్, జనవరి నెలల్లో ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. హైదరాబాద్, సికింద్రాబాద్, కొల్లం, కొట్టాయం మధ్య వీటిని నడుపుతామని అధికారులు తెలిపారు. ఏయే తేదీల్లో రైళ్లు అంటుబాటులో

3లో

## ఫోన్ పోగగొట్టుకున్న వ్యక్తి ఖాతాలో నగదు సఫా

పోలీసులకు ఫిర్యాదుచేసిన వ్యక్తి

**హైదరాబాద్, ననవంబర్ 26 (సమ సమాజం):** ఆటోలో ఫోన్ పోగొట్టుకున్న ఓ వ్యక్తి యూపీఐ వ్యాలెట్ యాప్ ద్వారా ఖాతాలో ఉన్న రూ. అరలక్షకు పైగా డబ్బు గుర్తుతెలియని వ్యక్తికి బదిలీ అయినట్లు తెలుసుకుని కంగుతిన్నాడు. ఫోన్‌లోనుంచే ఈ మొత్తం బదిలీ జరిగినట్లు తెలుసుకుని పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన వీరప్రతాప్ సింగరేణిలో ఉద్యోగి. ఈనెల 23న తెల్లవారుజామున 4.25 గంటల ప్రాంతంలో సికింద్రాబాద్ వెళ్లడానికి ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద ఓ ఆటో ఎక్కి ముందు సీట్లో కూర్చున్నాడు. పంజాగుట్ట చౌరస్తాకు రాగానే ఆటో డ్రైవర్ అతన్ని బలవంతంగా దించి బంజారాహిల్స్ వైపు హడావిడిగా వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత చూసుకోగా మొబైల్ ఫోన్ కనిపించలేదు. ఆటో కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. అత్యవసరంగా స్వస్థలానికి వెళ్లాల్సి ఉండడంతో మంచిర్యాలకు వెళ్లిపోయాడు. అక్కడ ఏటీఎంలో

3లో

## సంపాదకీయం

# రాజ్యాంగం అమలులో లోపించిన చిత్తశుద్ధి !

భారత రాజ్యాంగాన్ని తుచ తప్పకుండా అమలు చేస్తున్నామా అన్న ఆత్మవిమర్శ ఇప్పుడు పాలకులకు అవసరం. వారు తమకు అనుకూలంగా చట్టాలను అమలు చేసుకుంటూ పోతున్నంత కాలం మన ప్రజలను బాగు చేయలేమని గుర్తించాలి. మన రాజ్యాంగం మేరకు ప్రజలకు సేవ చేస్తున్నామా లేదా అని గుండెమీద చేయి వేసుకుని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాల్సిన సమయమిది. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకునే సంప్రదాయం 2015 నుండి కొనసాగుతుంది. అలాగే ఈరోజునే జాతీయ న్యాయ దినోత్సవాన్ని కూడా జరుపుకుంటూ వస్తున్నాం. భారత రాజ్యాంగం అమలు 1947 ఆగస్టు 15న భారత స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగ రచనకి సన్నాహాలు జరిగాయి. రాజ్యాంగ నిర్మాణం కోసం చాలా కసరత్తులు జరిగాయి. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడి అంబేద్కర్ సారథ్యంలో కమిటీ పూర్తి స్థాయి రాజ్యాంగాన్ని రూపొందించింది. అనేక మేథోమథనాల మధ్య భారత ప్రజల శ్రేయస్సు కోసం లిఖిత రాజ్యాంగాన్ని రచించారు. 1949 నవంబర్ 26న అప్పటి అసెంబ్లీ దీన్ని ఆమోదించింది. రెండు నెలలు తర్వాత 1950 జనవరి 26న భారతదేశ మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేసి దేశాన్ని సంపూర్ణ గణతంత్ర దేశంగా ప్రకటించారు. ఆనాటి నుంచి దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ దినోత్సవం 2015లో అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా జరపాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నవంబరు 19న కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. అప్పటి నుంచి నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అంతకుముందు ప్రతి ఏటా ఈ రోజును జాతీయ న్యాయ దినోత్సవంగా మాత్రమే జరుపుకునేవారు. 1979లో అప్పటి సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్.ఎమ్. సింఘ్వి సూచన మేరకు ఆ రోజును జాతీయ న్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించారు. అయితే మనం మన రాజ్యాంగాన్ని అక్షరబద్ధంగా,స్ఫూర్తితో పాటిస్తున్నామా అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. మనం ఎటువైపు వెళు న్నామో, మన ప్రాధాన్యత ఏమిటి, దేశాన్ని ఎటువైపు తీసుకెళ్తున్నామో మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన అవసరాన్ని పాలకులు గుర్తించాలి. విభిన్నమైన మన దేశాన్ని.. మన రాజ్యాంగం ఏకీకృతం చేసిందనడంలో సందేహం లేదు. ఎన్నో అవరోధాల తర్వాత రాజ్యాంగాన్ని రచించినట్లు ప్రజలు గుర్తించాలి. స్వతంత్రంగా ఉన్న రాష్ట్రాలను మన రాజ్యాంగం ఏకంగా చేసింది. బ్రిటిష్ వారు వదిలి వెళ్లిన తరవాత ఎన్నో మార్పులు,చేర్పులు జరిగాయి. ఎన్నో అభివృద్ధి పనులు చేసుకున్నాం. అయినా రాజ్యాంగం నేటికీ అపహాస్యం అవుతూనే ఉంది. దానికి పాలకులే ప్రధాన కారణం. తమకు అనుకూలంగా చట్టాలను మార్చుకుంటూ..తమ మనోగతాలకు అనుగు ణంగా పాలన చేస్తున్నారే తప్ప ప్రజలు,దేశం అన్న చిత్తశుద్ధితో పాలన సాగించడం లేదు. అనేక మంది నేతలు తమ మేథోమథనంతో రాజ్యాంగాన్ని రచించినా ఇంకా వెలితి కనిపిస్తునే ఉంది. మహాత్మాగాంధీతో పాటు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన ఎంతో మంది నేతలు భారత ఉజ్వల భవిష్యత్‌కు కలలు కన్నారు. కానీ నాయకులు అభివృద్ధి చెందుతున్నా ప్రజలు ఇంకా కూడు,గూడు, గుడ్డ కోసం అలమటి స్తున్నారు. అందుకే రాజ్యాంగ నిర్మాణంపై ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరం ఉంది. మన హక్కుల రక్షణ కోసం మన విధులు ఏంటో తెలుసుకోవాల్సి ఉంది. న్నారు. ఈ రోజు మనం మన రాజ్యాంగం చెప్పినదంతా అనుసరించి పాలన చేస్తున్నామా అన్న ఆత్మపరిశీలన చేసుకోవా ల్సిన అవసరం ఉంది. రాజ్యాంగాన్ని భారతదేశానికి స్వాతంత్య్రం పొందిన వారు రచించారు. అయితే ఈరోజు మనం రాజ్యాంగం లోని ఒక పేజీని కూడా అనుసరిస్తున్నామా అని తర్కించుకోవాల్సి ఉంది.

కుటుంబ పాలన వల్ల దేశం ఎంతో వెనకబడి పోయింది. స్వార్థ పరులు, గుండాలు, దోపిడీదారుల కారణంగా కూడా మనమెంతో నష్టపోయాం. తరతరాలు ఒకే కుటుంబం చేతుల్లో ఉంటే, అది ఆరోగ్యకరమైన ప్రజాస్వా మ్యానికి సవాలుగా మారుతుంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాజకీయ పార్టీలను గమనిస్తే..ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్యానికి పనికి రాదని గుర్తించాలి. రాజ్యాంగం చెప్తున్న దానికి ఇది విరుద్ధమని ప్రజలు గుర్తించాలి. కుటుంబాల చేతుల్లో ఉండే పార్టీలవల్ల ప్రజలకు మేలు జరగదు. ఒకే కుటుంబం నుంచి పార్టీలోకి ఎక్కువ మంది రావద్దన్న ఆంక్షలు ఉండి తీరాల్సిందే.అయితే యోగ్యులైన వారు ఒకే కుటుంబంలో ఎందరు ఉన్నా.. ప్రజల దీవెనెలు ఉంటే.. వారంతా పార్టీలో సేవ చేయవచ్చు. కానీ ఒక పార్టీని తరతరాలు ఒకే కుటుంబం ఏలితే, ఆ పార్టీలో ఉన్న వ్యవస్థలన్నీ ఒకే కుటుంబం వద్ద ఉంటే, అది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తుంది. భారత రాజ్యాంగం మనకు నిత్య భగవత్ గీత కావాలి. దేశం పట్ల మన కర్తవ్యాన్ని నిర్వర్తించేందుకు రాజ్యాంగం మనల్ని ప్రేరేపించేలా చూసుకోవాలి. ప్రతి ఒక్కరం దేశం కోసం పనిచేయాలని తపిస్తే, అప్పుడు మనం నవ భారత్‌ను నిర్మించవచ్చు. దాదాపు మూడేళ్ళ మేథో మథనం తర్వాత, నవంబర్ 26, 1949 నాడు రాజ్యాంగసభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించింది. రాజ్యాంగ చిత్తు ప్రతికి 7635 సవరణలు ప్రతిపాదిస్తే 2474 ఆమోదం పొందాయి. ఆ మూడేళ్ళలో 53వేల మంది ప్రజలు రాజ్యాంగ సభ చర్చలను ప్రత్యక్షంగా చూశారు. వర్తమాన భారతదేశ శాసన నిర్మాణం, రాజ్యాంగ సవరణలలో ఈ స్ఫూర్తి మచ్చుకైనా కనపడదు. ప్రజలలో, పాలనలో అసలు స్వాతంత్య్ర పోరాట విలువ లు మృగ్యయ్యాయి. మనమంతా ఏటా ఘనంగా రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుకుంటూ పోవడం కాదు..అమలుకు కృషి చేయాలి. రాజకీయాల్లో కఠిన నిబంధనలు రావాలి. ప్రజల హక్కులను కాపాడడానికి రాజ్యాంగం ఉండాలే తప్ప పాలకుల కోసం రాజ్యాంగం ఉండరాదన్న సూత్రాన్ని అమలు చేసుకుంటూ.. కాలనుగుణంగా రాజ్యాంగాన్ని మరింత పటిష్టంగా ముందుకు నడిపించుకుని పోవాల్సి ఉంది.

పృద్వీరాజ్ గోసుకొండ
ఎడిటర్

# భారత రాజ్యాంగానికి బద్ధుడనై పనిచేస్తున్నా




## రాజ్యాంగాన్ని అర్థం చేసుకోలేక పోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడలేం

### పలు అంశాలపై ట్విట్టర్‌లో షేర్ చేసిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,నవంబర్26(సమ సమాజం): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. పలు కీలక అంశాల గురించి ట్విట్టర్‌లో షేర్ చేశారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్న నాటినుంచి.. ప్రధానమంత్రి అయ్యే వరకు తాను భారత రాజ్యాంగ స్ఫూర్తితో అనుసరించిన పలు కీలక అంశాల గురించి ప్రస్తావించారు. భారత రాజ్యాంగాన్ని అర్థం చేసుకోలేకపోతే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కష్టం.. అని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రస్తావించారు. 2021 రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ప్రసంగించిన ప్రధాని మోడీ.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటంలో బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తుందని.. అదే ఫైనల్ అంటూ పేర్కొనడం.. భారత రాజ్యాంగం పట్ల ఆయనకున్న మేథో శక్తి, విశ్వాసాన్ని తెలియజేస్తుంది. ఈ రోజు భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. పలు కీలక అంశాల గురించి ట్విట్టర్‌లో షేర్ చేశారు. 1949లో రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన జ్ఞాపకార్థంగా.. 2015 నుంచి నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా కేంద్రం నిర్వహిస్తోంది. బీఆర్ అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకుని 2015లో కేంద్రంలో మోడీ ప్రభుత్వం.. ఈ రోజును రాజ్యాంగ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. అంతకుముందు ఈ రోజును లా డేగా పాటించేవారు. అయితే, ప్రధాని మోడీ తాజాగా.. మోడీ ఆర్కైవ్ లో షేర్ చేసిన అంశాలు.. ఆయనకు భారత రాజ్యాంగంపై ఉన్న మక్కువ..దార్శనికతకు ఈ కార్యక్రమాలు అద్దంపడుతున్నాయి. భారత రాజ్యాంగం రచించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోడీ.. 1999లో చేతిరాతతో ఓ కీలక అంశాన్ని ప్రస్తావించారు. 'రాజ్యాంగానికి 50 సంవత్సరాలు పూర్తయ్యాయి. మన కర్తవ్యం లేదా మన హక్కులు దేశాన్ని ముందుకు నడిపించగలవా..? అనే దానిపై దేశవ్యాప్త చర్చ అవసరం. రాబోయే శతాబ్దంలో దేశ నిర్మాణం ఒక ప్రజా ఉద్యమంగా ఎలా మారుతుంది?' అనే అంశాలపై చేతితో స్వయంగా రాసిన పేజీలను ఆయన షేర్ చేశారు. ÷ూజ్యాంగం ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. 2010లో అప్పటి సిఎం మోడీ సంవిధాన్ గౌరవ్ యాత్రను నిర్వహించారు. గుజరాత్‌లోని సురేంద్రనగర్‌లో ఏనుగుపై ఉన్న రాజ్యాంగానికి సంబంధించిన భారీ ప్రతిరూపంతో కూడిన చారిత్రాత్మక ర్యాలీని ఆయన నిర్వహించారు. 2011లో అప్పటి గుజరాత్ సీఎం మోదీ 'భారత్ ను సంవిధాన్' భారత రాజ్యాంగానికి గుజరాతీ వెర్షన్‌ను విడుదల చేశారు. భారత రాజ్యాంగాన్ని స్థానిక భాషలో ప్రచురించడం వల్ల ప్రజలు దేశ చట్టాలను బాగా అర్థం చేసుకోవడంలో, దాని స్ఫూర్తిని తెలియజేయడంలో సహాయపడతాయని మోదీ విశ్వసించారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆమోదించినందుకు గౌరవసూచకంగా 2015 నుంచి ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహించాలని పీఎం మోడీ నాయకత్వంలో ప్రభుత్వం తీర్మానం చేసింది. ఈ మేరకు కొత్త పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ కాన్‌స్టిట్యూషన్ హాల్ / గ్యాలరీలో భారత రాజ్యాంగానికి సంబంధించిన కీలక అంశాలను చిత్రాలను కూడా ప్రదర్శిస్తోంది. 2019లో రెండోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టే ముందు ప్రధాని మోడీ.. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగానికి నమస్కరించి బాధ్యతలు స్వీకరించారు.

## మహిళలను కించపరిచేలా రాందేవ్ బాబా వ్యాఖ్యలు

### చర్యలు తీసుకోవాలంటూ తిరుపతిలో ఫిర్యాదు చేసిన ఐద్వా




తిరుపతి,నవంబర్26(సమ సమాజం):మహిళలను అవమానపరుస్తూ వ్యాఖ్యలు చేసిన రాందేవ్ బాబాను తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతిలో ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా మహిళలను ఉద్దేశించి... చీరలో, సూట్, సల్వార్ లలో బాగుంటారని, తనకైతే ఏమి వేసుకోకున్నా బాగుంటారని మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసారని తెలిపారు. రాందేవ్ బాబాపై కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాంటి మాటలు మాట్లాడడం అనేది పరిపాటిగా మారిపోయిందని తెలిపారు. అనేకమంది బాబాలు మహిళల పట్ల కించపరుస్తూ వ్యాఖ్యలు చేసినప్పటికీ వారిపైన కేంద్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదన్నారు. ప్రతిరోజు ఏదో సందర్భంగా ఇలాంటి బాబాలు, గరికిపాటి లాంటి వ్యక్తులు మహిళలు కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వాటిని జాతీయ రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా కేసును తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఇందులో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి నదియా, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి పాల్గొన్నారు.

## మహిళల పట్ల బాబా రాందేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు



(మొదటి పేజి తరువాయి) యోగా పీఠ్, ముంబయి మహిళా పతంజలి యోగా సమితి సంయుక్తంగా శుక్రవారం యోగా సైన్స్ క్యాంపును నిర్వహించాయి. ఈ క్యాంపుకు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ భార్య అమృతా ఫడణవీస్, సిఎం ఏక్‌నాథ్ శిందే కుమారుడు, ఎంపి శ్రీకాంత్ శిందే, పలువురు మహిళలు హాజరయ్యారు. అయితే, మహిళలకు ఏర్పాటు చేసిన యోగా శిక్షణా కార్యక్రమం ముగిసిన వెంటనే వారికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు వివిధ రకాల వస్త్రాలు ధరించి పాల్గొన్నారు. తాము తెచ్చుకున్న చీరలు ధరించడానికి కూడా సమయం చాలకపోవడంతో వివిధ డ్రెస్సుల్లో హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రామ్‌దేవ్ బాబా మాట్లాడుతూ మహిళలు చీరల్లో బాగుంటారు. సల్వార్ సూట్స్‌లోనూ బాగుంటారు. నా కంటికైతే వారేం ధరించకపోయినా అందం గానే ఉంటారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. రామ్‌దేవ్ బాబా వ్యాఖ్యలపై మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ సావంత్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా రామ్‌దేవ్ బాబా తన అసలు మనస్తత్వం బయట పెట్టారంటూ విమర్శించారు. మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలతో వారిని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు.

## న్యాయమూర్తుల బదిలీని నిలిపివేయండి




### కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రఘురామ లేఖ

న్యూఢిల్లీ,నవంబర్26(సమ సమాజం): కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజీజ్‌కు ఎంపీ రఘురామ లేఖ రాశారు. ధర్మాన్ని కాపాడుతున్న ఇద్దరు న్యాయమూర్తులను శుక్రవారం బదిలీ చేస్తూ కొలీజియం సిఫార్సు చేసిన అంశంపై కిరణ్ రిజీజ్‌కు రఘురామ లేఖ రాశారు. న్యాయమూర్తుల బదిలీ అంశాన్ని మరోసారి పునసమీక్షించాలని లేఖలో కోరారు. కొలీజియం నిర్ణయాన్ని పున: సమీక్షించాలన్నారు. న్యాయాన్ని కాపాడే వారిని కూడా బదిలీ చేస్తే ఎలా అని న్యాయవాదులు ఆందోళన చేస్తున్నారని రఘురామ తన లేఖలో పేర్కొన్నారు.

## ప్రజలకు సత్వర న్యాయం లక్ష్యం కావాలి

### రాజ్యాంగ దినోత్సవంలో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్



న్యూఢిల్లీ,నవంబర్26(సమ సమాజం): ప్రజలకు న్యాయం అందాలని, ప్రజల వద్దకే కోర్టులు వెళ్లాలని, న్యాయం కోసం కోర్టుల చుట్టూ ప్రజలు తిరిగేలా చేయకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయ వ్యవస్థలో సాంకేతిక విప్లవం వచ్చిందని, సాంకేతిక మౌళికసదుపాయాల్ని ధ్వంసం చేయరాదు అని, ప్రతి ఒక్కరికీ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీజేఐ అన్నారు. దేశంలో భిన్నత్వం ఎక్కువే అని, ఇలాంటి దేశంలో సవాళ్లు కూడా ఎక్కువే ఉంటాయని, న్యాయం అందరికీ అందేలా న్యాయవ్యవస్థ చూడాలని అన్నారు. భారతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక అంశాలను ప్రవేశపెట్టారని సీజేఐ తెలిపారు. సుప్రీంకోర్టు ఢిల్లీలోని తిలక్‌మార్గ్‌లోనే ఉన్నా.. ఈ దేశానికి అదే అత్యున్న న్యాయస్థానం అన్నారు. వర్చువల్ విధానం వల్ల.. లాయర్లు తమ తమ స్వంత ప్రదేశాల నుంచే కేసుల్ని వాదించే అవకాశం వచ్చిందని ఆయన తెలిపారు. కేసుల లిస్టింగ్ విషయంలో టెక్నాలజీని ఆశ్రయించాలని సీజేఐ సూచించారు.

## రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపి

### ఆమ్ ఆద్మీ పార్టీ పిలుపు

కోనసీమ,నవంబర్26(సమ సమాజం): రాజ్యాంగ దినోత్సవాన్ని ఎపిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న పాలకుల తీరును తప్పుపట్టారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపి విధానాలను తిప్పికొట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జిల్లా గౌరవ అధ్యక్షులు తోకల వరదరాజ అన్నారు. తాళ్ళరేవులో ఎండియూడబ్ల్యూఏ నాయకులు రెడ్డి గిరిబాబు స్వగృహంలో జరిగిన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజన తర్వాత రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదాను బిజెపి విస్మరించి రాష్ట్రానికి అన్యాయం చేస్తుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరించడానికి ప్రయత్నం చేస్తుందని ,కడప స్టీల్ ఫ్యాక్టరీ మాటే మరిచిందని అన్నారు. హామీలను తుంగలో తొక్కి రాజ్యాంగ ఉల్లంఘన చేస్తున్న బిజెపి పార్టీని దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా అంతట రాజ్యాంగ పరిరక్షణ కోసం యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు రాజ్యాంగ పరిరక్షణ కోసం వినతి పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

## వచ్చే ఏడాది అంబేద్కర్ విగ్రహావిష్కరణ




### సంఘ సంస్కరణల చరిత్రలో రాజ్యాంగం గొప్పది

### రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో సిఎం జగన్

విజయవాడ,నవంబర్26(సమ సమాజం): వచ్చే ఏడాది ఏప్రిల్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించ బోతున్నామని సిఎం జగన్ తెలిపారు. సంఘ సంస్కరణల చరిత్రలో రాజ్యాంగం అత్యంత గొప్పదని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిఅన్నారు. శనివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సిఎం జగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నామని జగన్ చెప్పారు. గ్రామ స్వరాజ్యానికి రూపకల్పన చేసిన ప్రభుత్వం తమదని.. సచివాలయాల వ్యవస్థతో సమూల మార్పులను తీసుకొచ్చామని అన్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలకు 50 శాతం ఇస్తున్నామని చెప్పారు. మంత్రి మండలిలో 70 శాతం మంది బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలే ఉన్నారని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ గా బీసీని, శాసనమండలి ఛైర్మన్‌గా ఎస్సీని, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్‌గా మైనార్టీ వ్యక్తిని నియమించామని చెప్పారు.

## రాజ్యాంగం మంచిదైనా పాలకుడు చెడ్డవాడైతే..

### రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బాబు



అమరావతి,నవంబర్26(సమ సమాజం): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రజలకు టీడీపీ అధినేత చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమన్యాయం అందించే ఉన్నత లక్ష్యాలతో రూపొందించిన రాజ్యాంగం మనదని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన ఒక బహిరంగలేఖను విడుదల చేశారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితుల నేపథ్యంలో రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రజలకు ఈ బహిరంగ లేఖ రాస్తున్నానని చెప్పారు. రాజ్యాంగం ఎంత మంచిద్కెనా దాన్ని అమలు చేసే పాలకుడు చెడ్డవాడు అయితే అది చెడ్డ ఫలితాలనే ఇస్తుంది. రాజ్యాంగం ఎంత చెడ్డద్కెనా దాన్ని అమలు చేసే పాలకుడు మంచివాడు అయితే అది మంచి ఫలితాలు ఇస్తుంది' అని డా.బి.ఆర్. అంబేద్కర్ 1949లో రాజ్యాంగ సభలో అభిప్రాయపడ్డారని లేఖలో ఆయన పేర్కొన్నారు. ఆయన నాడు చేసిన వ్యాఖ్యలు జగన్ రెడ్డి లాంటి చెడ్డ పాలకులు భవిష్యత్తులో వస్తారని ముందే ఊహించి చెప్పి ఉంటారని అన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన జరుగుతోందని విమర్శించారు.

## ఎంఎంటిఆఎస్‌కు సహకరించని ప్రభుత్వం

### ప్రతి స్కీమ్ వెనకా స్కామ్ ఉంటోంది: బూర

యాదాద్రిభువనగిరి,నవంబర్26(సమ సమాజం): యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ నడిపితే ప్రజలకు ఎంతో మేలు జరిగేదని బిజెపినేత మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. పెరుగుతున్న ంజనాభాకు అనుణంగా రవాణా సౌకర్యం పెరగాలన్నారు. యాదాద్రికి వెళ్లే భక్తులకు ఎంఎంటిఎస్ రావాల్సి ఉందన్నారు. ఇప్పవరకు అది రాలేదంటే అది రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేకపోవడం వల్లనేనని చెప్పారు. భువనగిరిలో జరిగిన ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి స్కీమ్ వెనుక ఒక స్కామ్ ఉంటుందని బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. భువనగిరి ఎంపీగా తాను చేసిన అభివృద్ధి..కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సహకారం వల్లనేనన్నారు. అభివృద్ధి విషయంలో బీజేపీకి భేదాలు లేవన్న ఆయన అందరిని సమానంగా చూస్తారని తెలిపారు. తాను టీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చింది తన భవిష్యత్తు కోసం కాదని... రాష్ట్ర భవిష్యత్తు గురించి చెప్పారు.రాష్ట్రంలో గడీల నియంతృత్వ పాలన విముక్తి కోసం పనిచేస్తానని, బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని బూరనర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. ప్రజలు ఆకాంక్షించిన తెలంగాణ సిద్ధించలేదన్నారు.



## చలికాలం ఆరోగ్య సమస్యలు

(మొదటి పేజీ తరువాయి) అంతే ముఖ్యం. ఇక జలుబును తగ్గించు కునేందుకు ప్రతిసారీ సప్లిమెంట్స్ కాకుండా.. ఇంట్లో ఉండే ఆహార పదార్థాలతోనూ ఈ సమస్యను తగ్గించుకోవచ్చు. శీతాకాలంలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటే.. అనారోగ్య సమస్యలు మాత్రమే కాకుండా.. జుట్టు, చర్మ, సమస్యలు తగ్గుతాయి. అలాగే ఈ సీజన్లో ఉష్ణోగ్రతలు పడిపోవడం వలన కీళ్ల నొప్పులు ఇబ్బంది కలిగిస్తాయి. ఉసిరి, నెయ్యి, బజ్రా, ఖర్జూరం, బాదం, ఆవాలు, పచ్చి కూరలు మొదలైనవాటి వలన ఈ సమస్యలను తగ్గించుకోవచ్చు. చలికాలంలో జలుబును తగ్గించి వెచ్చగా ఉంచే పదార్థాలు వాల్ నట్స్, బాదంపప్పు. వాల్ నట్స్ వేడిని కలిగిస్తాయి. దీంతో శరీరం వెచ్చగా ఉండడం మాత్రమే కాదు. నాడీ వ్యవస్థ మెరుగ్గా ఉంటుంది. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. పిల్లలకు వెచ్చిన బట్టలువేసినట్లుగానే వయసుపైబడ్డ వారు సైతం వెచ్చిన బట్టలు వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఖాతాలో నగదు సఫా

(మొదటి పేజీ తరువాయి) డబ్బు డ్రా చేసేందుకు ప్రయత్నించగా ఖాతాలో డబ్బులు లేకపోవడాన్ని గమనించాడు. వెంటనే ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా గూగుల్ పే, ఫోన్ పే ద్వారా వివిధ ఖాతాలకు రూ.57,362 బదిలీ అయ్యాయని తెలుసుకున్నాడు. నగరానికి వచ్చిన అతను పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఇది ఆటో డ్రైవర్ పనేనని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు

## శంషాబాద్‌లో 2కిలోలకుపైగా బంగారం పట్టివేత

(మొదటి పేజీ తరువాయి) హైదరాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ):శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారం పట్టుబడింది. అక్రమ రవాణాకు అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. టెక్నాలజీతో ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుక్కుంటూ అడ్డదారులు తొక్కుతున్నారు. కస్టమ్స్ కళ్లుగప్పి గోల్డ్ స్మగ్లింగ్ కు పాల్పడుతూ అడ్డంగా బుక్కవుతున్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం శంషాబాద్ లో మరోసారి బంగారం పట్టుబడింది. కోటి రూపాయలకు పైగా విలువ చేసే 2.1 కేజీల బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. దుబాయ్ నుంచి వస్తున్న మంజా ప్రసాద్ గౌడ్ అనే ప్రయాణికుడు వద్ద నుంచి బంగారు బిస్కెట్లను లగేజ్ బ్యాగ్ లో దాచి తరలించే యత్నం చేయగా పట్టుకున్నారు. లగేజ్ బ్యాగ్ స్కానింగ్ లో అక్రమ బంగారం గుట్టు రట్టు అయ్యింది. అనంతరం గోల్డ్ ను సీజ్ చేశారు. ప్రయాణికుడిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు కస్టమ్స్ అధికారులు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి



(మొదటి పేజీ తరువాయి) ఉత్పత్తులను నిషేధించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత పట్టణాలుగా మార్చాలన్నారు. సిద్దిపేట మున్సిపల్ అభివృద్ధిలో రోల్ మోడల్‌గా ఉందన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఇదే సమయంలో ఆయా మున్సిపాలిటీలు డిసెంబర్ తరువాత ప్లాస్టిక్‌ను పట్టణంలో నిషేధించినట్లు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధంపై థార్డ్ పార్టీ ద్వారా విచారణ జరిపించి అవార్డులు ఇస్తామని తెలిపారు. మున్సిపాలిటీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్లలో అధికారులు లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలన్నారు. సిద్దిపేట మున్సిపల్‌లో ప్రస్తుతం 60శాతం వసూల్లు జరిగాయని, నిర్ధేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మున్సిపాలిటీల్లో అక్రమ లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) పథకాన్ని నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా దరఖాస్తులను స్వీకరించి క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో తడి, పొడి చెత్త సేకరణ విషయంలో ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత గూర్చి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

## అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్యరైల్వే శుభవార్త

(మొదటి పేజీ తరువాయి) ఉంటాయి, అవి ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణిస్తాయనే వివరాలను ప్రకటించారు. ల్గ÷దరాబాద్-కొల్లం (నం.07133) డిసెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో అందుబాటులో ఉంటుంది. జనవరి 2, 9, 16 తేదీల్లో నడుస్తుంది. కొల్లం-హైదరాబాద్ (నం.07134) డిసెంబర్ 6, 13, 20, 27, జనవరి 3, 10, 17 తేదీల్లో నడుస్తుంది. ఈ రైలు సికింద్రాబాద్, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూర్ మీదుగా వెళ్తుంది. సికింద్రాబాద్-కొట్టాయం (నం. 07125): డిసెంబర్ 4,11, 18, 25, జనవరి 1, 8 తేదీల్లో, కొట్టాయం-సికింద్రాబాద్ (నం.07126) మధ్య డిసెంబర్ 5, 12, 19, జనవరి 2, 9 తేదీల్లో అందుబాటులో ఉంటుంది. ఇది చర్లపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కోయంబత్తూరు మీదుగా వెళ్తుంది. నర్సాపురం-కొట్టాయం (నం. 07119) డిసెంబర్ 2,9,16,30, జనవరి 6,13వ తేదీలలో తిరగనుంది. కొట్టాయం-నర్సాపురం (నం. 07120) డిసెంబర్ 3,10,17,31వ తేదీలతో పాటు జనవరి 7,14వ తేదీలలో నడవనుంది. ఇది పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కోయంబత్తూరుతో పాటు ప్రాధాన స్టేషన్లలో ఆగుతుంది.

## ఛలో ఢిల్లీ గోడ పోస్టర్ విడుదల



**చండూర్, నవంబర్ 26 (సమ సమాజం):** మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో చలో ఢిల్లీ గోడ పోస్టర్ ను చండూరు మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు కురుపాటి సుదర్శన్ గార్లు విడుదల చేశారు. అనంతరం చైర్మన్ చంద్రకళ మాట్లాడుతూ....గత 25 సంవత్సరాలుగా మాదిగలు న్యాయమైన పోరాటం చేస్తున్నప్పటికీ కాంగ్రెస్ బిజెపి కేంద్ర ప్రభుత్వాలు మాదిగలపై మొండి వైఖరిని అవలంబిస్తూ జాతిని అనగతొక్కే ప్రయత్నం చేయడం నిజంగా బాధాకరమని అన్నారు. కౌన్సిలర్ వెంకన్న మాట్లాడుతూ.... తెలంగాణలో మాదిగలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలని బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు కురుపాటి సుదర్శన్ మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు గారు మాదిగల పోరాటం ముమ్మాటికి న్యాయమైనదే కనుక అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపి నేటికీ 8 సంవత్సరాలు గడుస్తున్నా కూడా పార్లమెంటులో వర్గీకరణ బిల్లు పెట్టకుండా కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం జాప్యం చేస్తూ మాదిగలను అన్ని విధాలుగా అనగ తొక్కుతుంది అని ఆవేదన వ్యక్తం చెందారు. దళితులు ఐనా అంబేద్కర్ ఆలోచన విధానాలు ఐనా బీజేపీకి నచ్చవు అన్నారు. అందుకే బీజేపీపై దండెత్తి పిడమర్తి రవి గారి నాయకత్వంలో చలో ఢిల్లీ జంతర్ మంతర్ లో డిసెంబర్ 12 నిరసన కార్యక్రమం, 13న మహా ధర్నాకు పిలుపునిస్తూ తెలంగాణలో మాదిగలకు జనాభా ప్రతిపాదికన 12% రిజర్వేషన్ కల్పించాలని మరియు పార్లమెంటు నూతన భవనానికి అంబేద్కర్ పేరు నామకరణం చెయ్యాలని కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలారి కరుణశ్రీ రవిందర్, ఎం.పి.టి.సి తలారి జంగాలు, శంకర్, వరికుప్పల సురేష్, గాదెపాక అర్జున్, లింగుస్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య నివారణకై చైతన్య సైకిల్ యాత్ర

### కాలుష్యం బారి నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ పౌరులందరిది : ఇండియన్ ఎన్విరాన్మెంట్ సోషల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జీడిమెట్ల రవీందర్






**మునుగోడు, నవంబర్ 26(సమ సమాజం):** మునుగోడు మండల కొంపెల్లి గ్రామం నుండి కాలుష్య నివారణ కోసం చైతన్య సైకిల్ యాత్రను శనివారం త్రివర్ణ పతాకంతో జండా ఊపి రవీందర్ మాతృమూర్తి ఎల్లమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఎన్విరాన్మెంట్ సోషల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు రవిందర్ మాట్లాడుతూ ఈ యాత్రను మునుగోడు నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని మండలాలు చుట్టి డిసెంబర్ 02 న జరిగే జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా చౌటు ప్పల్‌లో అవగాహన సదస్సును ఏర్పాటు ఉంటుందన్నారు. కొంపెల్లి, చీకటిమామిడి, పలివెలలోని స్వ తంత్రసమర యోధులు పర్యావరణవేత్త కొండవీటి గురునాథరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తూ మునుగోడు మీదుగా చండూరు మండలానికి యాత్ర బయలు దేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈరిగి విజేందర్, డోకూరి వేణుగోపాల్ రెడ్డి, బోయపర్తి సురేందర్, సునీల్ పుట్టపాక, నెల్లికంటి యాదయ్య, వీరమల్ల గోపాల్, జీడిమెట్ల సైదులు, మోగుదాల రాజు, ఆనగంటి కృష్ణ, గజ్జల బాలరాజ్, గోస్కొండ చంద్రయ్య, గోల్కొండ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తితో కెసిఆర్ పాలన



(మొదటి పేజీ తరువాయి) నేపథ్యంలో వరంగల్ జిల్లా పర్వతగిరిలోని తన నివాసంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.. బాబాసాహెబ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలావుంటే తెలంగాణ ప్రజల మనసులో కేసీఆర్ తప్ప, ఎవరూ లేరని మహబూబాబాద్ టిఆర్ఎస్ ఎమ్ఎల్యే శంకర్ నాయక్ అన్నారు. కెసిఆర్ చేస్తున్న అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణను దేశంలోనే అభివృద్ధి సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. దేశంలోనే సంక్షేమ రారాజుగా తెలంగాణ రాష్ట్రం ముందున్నని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో ఉన్నారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వేల కోట్లు ఆదాయాన్ని పెంచి ప్రజలకు సంక్షేమం ద్వారా అందిస్తోందని అన్నారు. సంపదను పెంచడంలోగానీ సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేయడంలో గానీ కేసీఆర్‌కు ఎవరూ సాటి రారన్నారు. కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే విమర్శలు చేస్తున్నారని, అలంటి నేతలకు బుద్ది చెప్పాలని పిలుపునిచ్చారు. మంచినీళ్ల నుంచి మద్యం వరకు సిండికేటు రాజకీయాలు చేసే నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీది, వారి హయాంలోనే నియోజకవర్గ ప్రజలకు తాగునీటి కష్టాలు వచ్చాయని మండిపడ్డారు. 60 ఏండ్లలో జరగని అభివృద్దిని నాలుగేండ్లలో సీఎం కేసీఆర్ చేసి చూపించాడని అన్నారు. కాంగ్రెస్, టీడీపీ హయాంలో ప్రజలు కరంట్ కష్టాలు అనుభవించారని, కానీ తెలంగాణ ప్రభుత్వం 24గంటల కరంట్ ఇస్తూ వారి కష్టాలను కడతేర్చిందని అన్నారు. దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్న కేసీఆర్‌కు జనం నీరాజనం పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పీఎస్ఎల్వీ సీ 54 రాకెట్ ప్రయోగం విజయవంతం

(మొదటి పేజీ తరువాయి) నిర్వహించారు. రాత్రి 10 గంటల తర్వాత రాకెట్ రెండో దశకు అవసరమైన లిక్విడ్ ఫ్యూయెల్ నింపారు. దాదాపు 25గంటల 30 నిమిషాల కౌంట్ డౌన్ అనంతరం ఉదయం 11 :56 గంటలకు ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి రాకెట్‌ను నింగిలోకి పంపారు. ప్రయోగంలో భాగంగా ముందుగా ప్రధాన శాటిలైట్ ఓషియన్ శాట్?6ను 742 కిలోమీటర్ల ఎత్తులోని ఆర్బిట్1లోకి చేర్చింది. అనంతరం రాకెట్ కిందకు దిగుతూ 516 నుంచి 528 కిలోమీటర్ల మధ్య ఆర్బిట్2లో మిగతా ప్యాసింజర్ శాటిలైట్లను వేర్వేరుగా విడిచిపెట్టింది. ఇలా వేర్వేరు ఆర్బిట్లలోకి శాటిలైట్లను చేర్చడం కోసం రాకెట్ కు ప్రత్యేకంగా రెండు ఆర్బిట్ చేంజ్ థ్రస్టర్లను అమర్చారు. ఇది పీఎస్ఎల్వీ రాకెట్ కు 56వ మిషన్ కాగా, పీఎస్ఎల్వీ ఎక్స్ఎల్ వెర్షన్ లో 24వ ప్రయోగం. ఓషియన్ శాట్2 స్థానంలో సేవలు అందించేందుకు ఓషియన్ శాట్6 శాటిలైట్‌ను ఇస్రో పంపింది. ఇది సముద్రపు రంగు, గాలులు, ఇతర అంశాలకు సంబంధించిన డేటాను నిరంతరం అందించనుంది.




మిగతా 8 ఉపగ్రహాల్లో 'ఇస్రో నానో శాటిలైట్ 2 ఫర్ భూటాన్ (ఐఎన్ఎస్2బీ)', బెంగళూరుకు చెందిన పిక్సెల్ ఇండియా స్టార్టప్ కంపెనీకి చెందిన 'ఆనంద్', హైదరాబాద్ కు చెందిన స్పేస్ స్టార్టప్ 'ధ్రువ స్పేస్'కు చెందిన రెండు 'థైబోల్ట్' నానో శాటిలైట్లు, అమెరికన్ కంపెనీ స్పేస్ ఫ్లైట్‌కు చెందిన నాలుగు 'ఆస్ట్రోక్యాస్ట్' నానో శాటిలైట్లను నింగిలోకి పంపారు. కాగా ప్రయోగం సక్సెస్ కావడంతో సతీష్ ధావన్ రీసెర్చ్ సెంటర్‌లో హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. కాగా షార్ నుంచి ఇది 87వ ప్రయోగం. పీఎస్ఎల్వీ రాకెట్ సిరీస్‌లో 56వ ప్రయోగం. పీఎస్ఎల్వీ ఎక్స్ఎల్ వెర్షన్‌లో 24వది కావడం విశేషం. అంతేకాదు.. ఈ ఏడాది ఇస్రో చేపట్టనున్న ఆఖరి ప్రయోగమిదే.

## మధ్యప్రదేశ్‌లో కొనసాగుతున్న జోడో యాత్ర

(మొదటి పేజీ తరువాయి) యాత్రలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యప్రదేశ్‌లో త్వరలో ఎన్నికలు జరగనుండటంతో కాంగ్రెస్ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి సారించింది. సీనియర్ నేతలంతా తరలివచ్చి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో పాల్గొని ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలపై ఆధిపత్యాన్ని చాటుకునేలా రాహుల్ పాదయాత్రలో హడావుడి చేస్తున్నారు. సెప్టెంబర్ 7వ తేదీన తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభమైన భారత్ జోడో యాత్ర కేరళ, కర్ణాటక, ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలలో పూర్తైంది. గత నాలుగు రోజులుగా మధ్యప్రదేశ్ లో కొనసాగుతున్న పాదయాత్ర డిసెంబర్ 4న రాజస్థాన్‌లో ప్రవేశించనుంది.

## ముందుచూపుతో అంబేడ్కర్ రాజ్యాంగ రచన

(మొదటి పేజీ తరువాయి) ఆరోపించారు. ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ ఆడిటోరియంలో కాన్స్టిట్యూషన్ డే కార్యక్రమంలో వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. పాండిచ్చేరి మంత్రి సాయి జే శరవణంకుమార్.. వివేక్ వెంకటస్వామిని పూలమాలతో సత్కరించారు. రాజ్యాంగం రాసేటప్పుడే రాజకీయ నాయకులు సరిగ్గా ఉపయోగించుకోవాలని, లేకుంటే ఇబ్బందులు ఉంటాయని అనాడే అంబేద్కర్ చెప్పారని వివేక్ వెంకటస్వామి గుర్తు చేశారు. ఇచ్చిన ఏ హామీలను కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ నెరవేర్చలేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితులకు మూడు ఎకారాల భూమి ఇవ్వలేద న్నారు. కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని, తెలంగాణ రాష్ట్రం కల్వకుంట్ల కుటుంబం కోసమే ఏర్పడినట్లు ఉందన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే కేంద్రంలో బీజేపీ పార్టీ నడుస్తోందని చెప్పారు. కేంద్ర కేబినెట్ లోనూ బడుగు, బలహీన వర్గాలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని తెలిపారు.

## ఆర్టికల్ 3 తోనే తెలంగాణ కల సాకారమైంది

(మొదటి పేజీ తరువాయి) మన దేశంలో రాజ్యాంగమే సుప్రీం అని వివరించారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగ విలువలను పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన తమ హక్కులను పొందుతూ.. కాపాడుకుంటూ.. విధులను పాటించాలని గవర్నర్ తమిళిసై కోరారు. ఇదిలావుంటే రాష్ట్ర సర్కార్ తీరుపై గవర్నర్ తమిళిసై అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఓ నేషనల్ టీవీ చానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆమె మాట్లాడారు. నేను హాజరవుతున్న అధికారిక కార్యక్రమాలకు కూడా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావడం లేదు. తాను గవర్నర్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఇదే పరిస్థితి నెలకొంది' అని అన్నారు. మహిళా గవర్నర్ అని తనపై వివక్ష చూపిస్తున్నారని, రాజ్ భవన్ ను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్ భవన్ కు, గవర్నర్ హోదాకు మర్యాద ఇవ్వడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు బహిరంగంగానే నాపై విమర్శలు చేస్తున్నారు.

## ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఇడి ఛార్జిషీట

(మొదటి పేజీ తరువాయి) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. అందులో సమీర్ మహేంద్రును ఏ1గా పేర్కొంది. ఏ2, ఏ3, ఏ4, ఏ5గా 4 కంపెనీల పేర్లు చేర్చింది. రౌస్ అవెన్యూ కోర్టులో దాదాపు 3వేల పేజీలతో కూడిన ఛార్జ్ షీట్ సాఫ్ట్ కాపీతో కూడిన హార్డ్ డిస్క్ సహా డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించింది. ఇదే కేసులో ఇప్పటికే అరెస్టైన వారిపై కూడా త్వరలోనే సప్లిమెంటరీ ఛార్జ్ షీట్స్ దాఖలు చేయనున్నట్లు ఈడీ కోర్టుకు చెప్పింది. అనంతరం న్యాయమూర్తి కేసు విచారణను డిసెంబర్ 12కు వాయిదా వేశారు. లిక్కర్ స్కాంలో మనీ లాండరింగ్ కు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సెప్టెంబర్ 27న సమీర్ మహేంద్రును అరెస్ట్ చేసింది. లిక్కర్ స్కాం కేసులో అరెస్టైన మరో నిందితుడు విజయ్ నాయర్ రెండ్రోజుల కస్టడీ ముగిసింది. దీంతో అధికారులు ఆయనను కోర్టులో హాజరు పరచారు. మనీలాండరింగ్?లో విజయ్ నాయర్ పాత్ర ఉందని కోర్టుకు వివరించారు. కస్టడీ ముగియడంతో సీబీఐ స్పెషల్ కోర్టు విజయ్ నాయర్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. కేసు తదుపరి విచారణను డిసెంబర్ 8కి వాయిదా వేసింది.

## మన రాజ్యాంగమే మనకు రక్ష




(మొదటి పేజీ తరువాయి) వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. 2015 నుండి- 1949లో రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన జ్ఞాపకార్థం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ జస్టిస్ క్లాక్‌తో సహా ఈ-కోర్ట్ ప్రాజెక్ట్ కింద ప్రధాన మంత్రి అనేక కొత్త కార్యక్రమాలను కూడా ప్రారంభించారు.మొబైల్ యాప్ 2.0, డిజిటల్ కోర్ట్ వెబ్‌సైట్‌లు వంటివి ఉన్నాయి. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తన శుభాకాంక్షలను తెలియజేస్తూ, 1949లో ఈ రోజున స్వతంత్ర భారతదేశం కొత్త భవిష్యత్తుకు పునాది వేసుకున్నదని ప్రధాని గుర్తు చేసుకున్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ సంవత్సరంలో రాజ్యాంగ దినోత్సవం ప్రాముఖ్యతను కూడా ప్రధాన మంత్రి గుర్తించారు. బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో పాటు రాజ్యాంగ పరిషత్ సభ్యులందరికీ ఆయన ఈ సందర్భంగా నివాళులర్పించారు. అందరికీ న్యాయం అందించేందుకు న్యాయవ్యవస్థ చర్యలు చేపడుతోందన్నారు. ఆజాదీ కా అమృత్ కాల్ దేశం పట్ల కర్తవ్యం చెప్పాల్సిన సమయం. ప్రజలు లేదా సంస్థలు కావచ్చు, మన బాధ్యతలే మన మొదటి ప్రాధాన్యత అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. 'కర్తవ్య మార్గాన్ని' అనుసరించడం ద్వారా దేశం అభివృద్ధిలో కొత్త శిఖరాలను చేరుకోగలదని ఆయన నొక్కి చెప్పారు. ఆజాదీ కా అమృత్ కాల్‌లో, ఇది దేశానికి అవసరం. ఈ రాజ్యాంగ దినోత్సవం ఈ దిశలో మన తీర్మానాలకు మరింత శక్తిని ఇస్తుందని ఆశిస్తున్నాను అంటూ ప్రధాన మంత్రి ముగించారు. భారత ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డివై. చంద్రచూడ్, కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ , జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి ప్రొ. ఎస్ పి బాఘెల్. , భారత అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా తుషార్ మెహతా , సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# చలన చిత్రం

## నటి శ్రీలీలకు బోలెడు ఛాన్సులు

### ధమాకా తరవాత క్యూ కట్టిన నిర్మాతలు



సినీరంగంలో తారలు వెలుగులోకి రావడానికి చాలా సమయమే పడుతుంది. కొందరు నటీమణులకు ఎన్ని సినిమాలు చేసిన అంతగా గుర్తింపు రాదు. అదే కొందరి విషయంలో మాత్రం ఒకటీ లేదా రెండు సినిమాలతో రావలిసిన దానికంటే ఎక్కువే గుర్తింపు వస్తుంది. ఈ విషయంలో శ్రీలీల నక్క తోకను తొక్కి వచ్చినట్టుంది. 'పెళ్ళి సందడి' సినిమాతో సినీరంగంలోకి ఎంట్రీ ఇచ్చిన శ్రీలీలకు మొదటి సినిమాతోనే యూత్‌లో విపరీతమైన క్రేజ్ వచ్చింది. ఈ సినిమా భారీ విజయం సాధించకపోయిన శ్రీలీల నటన, అందాల ఆరబోతకు టాలీవుడ్ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఈ ఒక్క సినిమాతో శ్రీలీలకు తెలుగులో వరుసగా అవకాశాలు క్యూ కట్టాయి. టాలీవుడ్ యువ హీరోలు దాదాపుగా ఈమె వైపే మొగ్గుచూపుతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఈమెకు మహేష్‌తో నటించే చాన్స్ వచ్చినట్లు తెలుస్తుంది. టాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం శ్రీలీలకు మహేష్‌బాబు సినిమాలో చాన్స్ వచ్చిందని టాక్. త్రివిక్రమ్-మహేష్‌బాబు కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం కోసం ఈమెను చిత్రబృందం ఎంపిక చేశారట. ఈ చిత్రంలో మేయిన్ లీడ్‌లో పూజా హెగ్డే నటించనుండగా.. సెకండ్ హీరోయిన్‌గా శ్రీలీల నటించనుందని సమాచారం. అయితే మేకర్స్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో అరడజనుకు పైగా సినిమాలున్నాయి. అందులో రవితేజ ధమాకా రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. దీనితో పాటు బాలకృష్ణ కూతురిగా నటిస్తుంది. ఇవే కాకుండా రామ్-బోయపాటి కాంబోలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌లోనూ శ్రీలీల హీరోయిన్‌గా ఎంపికైంది.


## విడుదలకు సిద్ధంగా హిట్-2

ఎలాంటి అంచనాల్లేకుండా రిలీజై అనూహ్య విజయం
సాధించిన చిత్రాల్లో 'హిట్' ఒకటి. విశ్వక్‌సేన్ ప్రధాన పాత్రలో
నటించిన ఈ చిత్రానికి సైలేష్ కొలను దర్శకత్వం వహించాడు.
దర్శకుడిగా సైలేష్‌కు డెబ్యూ సినిమానే అయినా.. తన టేకింగ్,
విజన్‌తో ప్రేక్షకులను సినిమా లాస్ట్ వరకు సీట్లలోనే
కూర్చొబెట్టాడు. ఈ చిత్రంతో ప్రొడ్యూసర్‌గా నానికి భారీ
హిట్ వచ్చింది. కాగా రెండేళ్ళ తర్వాత ఈ సినిమాకు సీక్వెల్
తెరకెక్కింది. సీక్వెల్‌లో అడివిశేష్ హీరోగా నటిస్తున్నాడు.
ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌లు సినిమాపై విపరీతమైన
అంచనాలు క్రియేట్ చేశాయి. తాజాగా ఈ చిత్రం
సెన్సార్ పూర్తి చేసుకుంది.
ఈ సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికేట్‌ను జారీ
చేసింది. కాగా ఈ సినిమా రన్‌టైం రెండు గంటలు
ఉండనుంది. ఈ మధ్య కాలంలో ఇంత తక్కువ
రన్‌టైంతో ఏ సినిమా రాలేదు. థ్రిల్లర్ సినిమాలకు
ఈ రన్‌టైం ఉంటే చాలా వరకు ప్లస్ అవుతుందని
పలువురు అభిప్రాయ పడుతున్నారు. క్రైమ్
థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం హిట్
యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కనుంది.
అడివిశేష్‌కు జోడీగా మీనాక్షి చౌదరీ
నటిస్తుంది. రావురమేష్, కోమలి ప్రసాద్
కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని
వాల్ పోస్టర్ సినిమాస్ బ్యానర్‌పై ప్రశాంత్
తిపిరినేనితో కలిసి హీరో నాని
నిర్మించాడు. ఈ సినిమా డిసెంబర్ 2న
ప్రేక్షకుల ముందుకు రానుంది.




## క్రిస్మస్ కానుకగా వస్తోన్న రణ్‌వీర్ సర్కస్ మూవీ

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. 'రామ్‌లీల', 'బాజీరావు మస్తానీ', 'పద్మావతి' వంటి సినిమాలతో తెలుగులోనూ మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు. గతేడాది ఈయన నటించిన '83' రిలీజై పాజిటీవ్ టాక్ తెచ్చుకుంది. కానీ కలెక్షన్‌ల పరంగా ఫేయిల్యూర్‌గా మిగిలింది. 1983 క్రికెట్ వరల్డ్ కప్ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం గొప్ప ప్రశంసలు దక్కించుకుంది. ప్రస్తుతం సర్కస్ అనే పీరియాడిక్ కామెడీ సినిమా చేస్తున్నాడు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రాన్ని క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 23న రిలీజ్ చేస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని టీ సరిస్ ఫిలింస్, రిలయన్స్ ఎంటర్‌టైనమెంట్స్‌తో కలిసి రోహిత్ శెట్టి స్వీయ నిర్మాణంలో రూపొందించాడు. ఇప్పటికే చిత్రం నుండి రిలీజైన పోస్టర్‌లు, టీజర్ సినిమాపై విపరీతమైన అంచనాలు క్రియేట్ చేశాయి. ఈ చిత్రంలో రణ్‌వీర్‌కు జోడీగా పూజా హెగ్డే, జాక్వెలిన్ ఫెర్నాండేజ్‌లు నటిస్తున్నారు. ఈ సినిమాలో రణ్‌వీర్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు.






## శరవేగంగా వీరసింహారెడ్డి మూవీ షూటింగ్

ఆకట్టుకుంటున్న మాస్ సాంగ్

బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'వీరసింహారెడ్డి'. రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గాడ్ ఆఫ్ మాసెస్ అనేది ట్యాగ్‌లైన్. శ్రుతిహాసన్ హీరోయిన్. వరలక్ష్మి శరత్‌కుమార్, దునియా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చాయి. శుక్రవారం 'జై బాలయ్య' అనే మాస్ సాంగ్‌ను రిలీజ్ చేసి ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేశారు. 'రాజసం నీ ఇంటి పేరు.. పౌరుషం నీ ఒంటి పేరు.. నిన్ను తలచుకున్న వారు.. లేచి నిల్చొని మొక్కుతారు.. అచ్చ తెలుగు పౌరుషాల రూపం నువ్వయ్యా.. అలనాటి మేటి రాయలోరి తేజం నువ్వయ్యా' అంటూ సాగిన పాట హీరో పాత్రని ఎలివేట్ చేస్తోంది. మాస్ లీడర్‌గా వైట్ అండ్ వైట్‌లో బాలయ్య ఆకట్టుకున్నారు. 'తిప్ప సామీ కోర మీసం.. తిప్ప సామీ ఊరి కోసం.. నమ్ముకున్న వారికోసం.. అగ్గి మంటే నీ ఆవేశం.. నిన్ను తాకే దమ్మున్నోడు లేనే లేడయ్యా' అంటూ నందమూరి ఫ్యాన్స్‌లో జోష్ నింపేలా రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ రాశారు. అంతే జోష్‌ఫుల్‌గా కరీముల్లా పాడాడు. ట్యూన్ కంపోజ్ చేయడంతో పాటు తమన్ సైతం వైట్ అండ్ వైట్ కాస్ట్యూమ్స్‌లో తనదైన డ్యాన్స్ మూమెంట్స్‌తో ఇంప్రెస్ చేశాడు. శంకర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశాడు. చుట్టూ జనాల మధ్య దేవాలయాలు, పచ్చని పల్లె పరిసరాలలో ఈ పాటని చిత్రీకరించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ మూవీ సంక్రాంతికి విడుదల కానుంది.



## పలు చిత్రాలతో బిజీగా కియారా

ఓ వైపు టాలీవుడ్.. మరోవైపు బాలీవుడ్ రెండు చోట్లా సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్ స్టేటస్‌ను ఎంజాయ్ చేస్తోంది కియారా అద్వాని. ఈ ఏడాది ఇప్పటికే భూల్ భులయ్యా 2, జగ్ జగ్ జియో చిత్రాలతో హిందీ ప్రేక్షకుల ముందుకొచ్చిన ఆమె, డిసెంబర్‌లో 'గోవింద నామ్ మేరా' చిత్రంతో రాబోతోంది. విక్కీ కౌశల్‌కి భార్యగా భూమి ఫెడ్నేకర్ నటిస్తుండగా కియారా నాటీ గర్ల్ ఫ్రెండ్‌గా కనిపించబోతోంది. శశాంక్ కైతన్ దర్శకుడు. ఈ కామెడీ థ్రిల్లర్ నుండి 'కొల్హాపూర్ కీ బిజ్లీ' అంటూ సాగే మాస్ సాంగ్‌ను నిన్న విడుదల చేశారు. బాలీవుడ్‌లో ఇప్పటికే వచ్చిన పలు మసాలా సాంగ్స్‌కు ఏమాత్రం తీసిపోని రీతిలో దీన్ని కంపోజ్ చేశారు సచిన్ జిగార్. కియారా కూడా స్టన్నింగ్ లుక్స్, రొమాంటిక్ ఎక్స్‌ప్రెషన్స్, ఇంప్రెసివ్ డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకుంది. గణేలిష్ ఆచార్య కొరియోగ్రఫీ చేశాడు. విక్కీ, కియారా ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ సాంగ్‌కు హైలైట్‌గా నిలిచింది. గతంలో ఈ తరహా స్పెషల్ సాంగ్స్ చేసిన కరీనా, కత్రినాలకు ఏమాత్రం తీసిపోని రీతిలో 'బిజిలీ'గా మెస్మరైజ్ చేసింది కియారా. ఫస్ట్ టైమ్ ఆమె నటిస్తోన్న ఈ ఔట్ అండ్ ఔట్ మసాలా ఎంటర్‌టైనర్ డిసెంబర్ 16న డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమ్ కానుంది. మరోవైపు రామ్ చరణ్‌కు జంటగా శంకర్ సినిమాలో నటిస్తోంది కియారా. ప్రస్తుతం న్యూజిలాండ్‌లో పాట తీస్తున్నారు. షూటింగ్ గ్యాప్‌లో చరణ్‌తో కలిసి బర్గర్ తింటూ, ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిందామె.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in